ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

శనివారం 24 మే 2025

నైరుతి రైల్వే వినియోగదారుల సంఘం సభ్యుడిగా భార్గవ్

బెంగళూరు, మే 23(ఆంధ్రజ్యోతి): నైరుతి రైల్వే వినియోగదారుల సలహా సంఘం సభ్యుడిగా నగరానికి చెందిన ఆర్ భార్గవ్‌ను నియమిస్తూ కేంద్ర రైల్వేశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నగర బీజేపీ యువమోర్చాలో కీలకంగా వ్యవహరించి, నగర ఉపాధ్యక్షుడి హోదాలో సుపరిచితుడైన భార్గవ్‌కు రైల్వే సలహాకమిటీలో చోటు దక్కింది. భార్గవ్ మాట్లాడుతూ.. ప్రయాణీకుల సేవలకోసం కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో రైల్వే ప్రయాణికుల సమస్యలను కేంద్ర స్థాయిలోకి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.





డేంజర్..!

- ఈ ఏడాది... ఘాట్ ప్రయాణాలు ప్రమాదమే
- జోరువానలతో విరిగిపడుతున్న కొండచరియలు
- చార్మాడిఘాట్, శిరాడిఘాట్‌లో ప్రమాదాలు ఎక్కువ
- తీరప్రాంత జిల్లాల్లో మరిన్ని కష్టాలు
- బెంబేలెత్తుతున్న వాహనదారులు

బెంగళూరు, మే 23(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఘాట్ రోడ్లపై ప్రయాణం అంటే ప్రమాదం ముంచుకొచ్చినట్లే అనే పరిస్థితి గడిచిన రెండేళ్లుగా కొనసాగుతోంది. రాష్ట్రంలో ప్రధానంగా పశ్చిమకనుమల మార్గంలో ఎటు ప్రయాణించాలన్నా ఘాట్‌రోడ్ల మీదుగానే సంచరించాల్సి ఉంటుంది. ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడం, ఘాట్ రోడ్లు నిర్మాణాలు పటిష్టంగా చేపట్టకపోవడంతో ప్రయాణికులు బెంబేలెత్తే పరిస్థితి కొనసాగుతోంది. గడిచిన రెండేళ్లుగా నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యాక రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దాదాపు మూడు నెలలపాటు వర్షం హోరెత్తింది. ఉత్తరకన్నడ జిల్లాలో కొండచరియలు విరిగిపడి నదిలోకి రెండు లారీలు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. చార్మాడి, శిరాడిఘాట్‌లలో ప్రయాణం అంటే వర్షాకాలంలో వెనుకడుగు వేసే పరిస్థితి ఉంది.

చార్మాడీలోనే ఎక్కువ..

చార్మాడీ ఘాట్‌లోనే అధిక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మూడు నాలుగేళ్లకోసారి చార్మాడి ఘాట్‌లో వర్షాకాలంలో సమస్యలు నెలకొంటాయి. సంపాజెలో ఐదేళ్లక్రితం భూమి కుంగిన సంగతి తెలిసిందే. శిరాడిఘాట్‌లో నిరంతరంగా పర్యవేక్షణ కొనసాగుతున్నా పాత వంతెనలు ప్రమాదాలకు సంకేతాలు అవుతున్నాయి. చార్మాడిలో నిర్మాణాల పేరిట తవ్వకాలు జరిగితే, మలుపుల్లో ఉండే చెట్లు నేలకొరుగుతున్నాయి. సంపాజె ఘాట్‌లో ప్రయాణం అద్భుతమైన సుందరమైన రోడ్డు అనిపించినా భద్ర నదికి అడ్డుగోడ సంపూర్ణంగా లేకపోవడం పలుమార్లు ప్రమాదానికి కారణమవుతోంది. జోడుపాళ, మణ్ణంగేరి, కర్తోజి ప్రమాదాలు అడ్డుగోడ లేకపోవడంతోనే జరిగాయనేది తెలిసిందే.

రుతుపవనాల కన్నా ముందే జోరు వానలు

రాష్ట్రంలో ప్రధానమైన నగరాలు మంగళూరుకు వెళ్లాలంటే చార్మాడి ఘాట్ మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుంది. జాతీయ రహదారి అయిన చార్మాడి, శిరాడిఘాట్‌లపై కొండచరియలు విరిగిపడుతుంటాయి. మరోవైపు నిర్మాణాలు ఏటా సాగుతున్నా అవి పూర్తి కావడం లేదు. ఏటా కొత్త ప్లాన్‌లు వేయడమేగానీ వాటిని అమలు చేసే విషయంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇక గోవా, ముంబైలకు వెళ్లే ప్రాంతం కూడా ఘాట్‌లకు అనుబంధంగానే ఉంది.

ఈ ఏడాది ఇంకా నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించలేదు. కానీ దాదాపు నెలన్నరకాలంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమకనుమల ప్రాంతంలో వర్షం హోరెత్తిస్తోంది. కొడగు, చిక్కమగళూరు, శివమొగ్గ ప్రాంతాల్లో దాదాపు నెలరోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఎండాకాలంలోనే వరుణుడి ప్రతాపం ఇలా ఉంటే ఇక వర్షాకాలం లో ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందోనని సుమా రు పది జిల్లాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం మొదలయ్యిందంటే ఘాట్‌రోడ్లపై రోజుల తరబడి సంచారాన్ని నిలిపివేస్తారు. ఇలా రోడ్లపైకి చేరాక ఒక్కసారిగా రవాణా నిలిపివేస్తే గంటలు, రోజుల తరబడి పడిగాపులు పడే పరిస్థితి ఉంటుంది. ఎప్పుడు ఏ కొండచరియ విరిగిపడుతుందో అనేభయం వెంటాడుతుంటుంది.




శిరాడి ఘాట్‌లో ప్రమాదం (ఫైల్)

అన్ని దారుల్లో తిప్పలే..

గడిచిన కొన్నేళ్లుగా పరిశీలిస్తే సంపాజె, బిసిలె, శిరాడి, చార్మాడి, ఆగుంబె, బాలెబరె, నిట్టూరు ఘాట్‌లు వర్షాకాలంలో సంపూర్ణంగా సురక్షితం కాదని రుజువయ్యింది. వర్షాకాలం వచ్చిందంటే తీరప్రాంత జిల్లాల్లో భారీగా గాలులు, వాన కురుస్తుంది. బెంగళూరు నుంచి మంగళూరుకు విమానంలో వెళ్లాలన్నా ల్యాండింగ్, టేకాఫ్ సమస్య కూడా కొనసాగిన సందర్భాలు ఉన్నాయి. ఇక రైలుమార్గం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రైల్వేట్రాక్ కూడా కొండచరియలకు అనుబంధంగా ఉన్న విషయం తెలిసిందే. ఇలా తీరప్రాంతాలు, పశ్చిమ కనుమల నుంచి బెంగళూరువైపు వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు ఏ విధంగానూ సురక్షితం కాదనేది కొన్నేళ్లుగా ఉంది. 26 కిలోమీటర్ల పొడవున శిరాడిఘాట్, 25 కిమీ చార్మాడిఘాట్, 17 కిమీ ఉన్న సంపాజె, 12 కిమీ ఉన్న బిసిలె, 14 కిలోమీటర్ల ఉన్న బాలెబరె, 16 కిమీ ఉద్దనిట్టూరు, 11 కిలోమీటర్ల ఉన్న ఆగుంబె ఘాట్‌లలో శాశ్వతమైన నిర్మాణాలు చేపట్టకపోతే రహదారి ప్రయాణం కష్టతరంగానే ఉంటుంది. ప్రస్తుతం శిరాడిఘాట్‌లో పైభాగంలో నిర్మాణాలు సాగుతున్నాయి. వర్షాకాలంలో శిరాడి ఘాట్‌లో చోటు చేసుకున్న ప్రమాదం రాష్ట్రాన్ని బెంబేలెత్తించింది. ప్రస్తుతం చార్మాడిలోనూ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

బిసిలె ఘాట్‌లో తారు, కాంక్రీట్‌రోడ్డు బాగున్నా ఇక్కడ చెట్లు తరచూ కూలుతుంటాయి. భారీ వాహనాలకు అవకాశం లేకున్నా చిన్న వాహనాలు కూడా ఆగుంబెలో సంచారం అంత సురక్షితం కాదనేది పలు సందర్భాల్లో రుజువయ్యింది.



శిరాడీ ఘాట్‌లో ప్రమాదకర మలుపులు

ఫేజ్ 2, 3 పనులకు కేంద్ర సహకారం

- బెంగళూరు మెట్రో పనుల పూర్తికి చేయూత: కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్

బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు మెట్రో ఫేజ్ 2, 3ఏ ప్రస్తావనలను పరిశీలించి సహకరిస్తామని కేంద్ర వసతి, నగరపాలక, విద్యుత్‌శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. బెంగళూరులో ప్రగతి పనులను శుక్రవారం సమీక్షించారు. రాష్ట్రమంత్రులు జమీర్ అహ్మద్‌ఖాన్, బైరతి సురేశ్, రహింఖాన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలో కొనసాగుతున్న వేస్ట్ మేనేజిమెంట్, వైట్‌ట్యాపింగ్ పనులపై ఆరా తీశారు. బెంగళూరులో 75 కిలోమీటర్ల మేర సంచారం ఉందని, 145 కిలోమీటర్ల పెంచేలా ప్రస్తావనలు పంపామన్నారు. మెట్రో ఫేజ్ 3ఏ అంచనాలపై నిపుణుల సంస్థ పరిశీలిస్తుందన్నారు. అంతకుముందు డీసీఎం డీకే శివకుమార్ కేంద్రమంత్రిని కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టుల విషయమై చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మనోహర్‌లాల్



జలాశయంలోకి చేరిన నీరు

ముందే జలకళ..!

- మేలోనే తుంగభద్రలోకి పది టీఎంసీల చేరిక
- హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు.. సాగుకు సిద్ధం

కంప్లి, మే 23(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం ఈ యేడు ముందే జలకళ సంతరించుకుంటోంది. ఈనెల 1వ తేదీ మొదలుకొని 23 వరకు 10.458 టీఎంసీల నీరు జలాశయంలోకి చేరినట్లు అధికారులు తెలిపారు. జలాశయం పైభాగంలో వన్నెల్లి, హర్లల్లి, సింగటలూరు, మోరళి, గదగ్ కొప్పాళ, హరప్పనహళ్లి, హగరి బొమ్మనహళ్లి, మారెమ్మనహళ్లి తదితర గ్రామాల్లో కురిసిన వర్షానికి నీరు పుష్కలంగా చేరుతున్నట్లు పేర్కొన్నారు. రుతుపవనాల కంటే అల్పపీడనాలు ఏర్పడుతుండంతో ఉభయ జిల్లాల్లో వర్షాలు జోరందుకున్నాయి. దీంతో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. నీటి చేరికతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో జోరుగా సేద్యాలు చేసుకుని ఖరీఫ్ పంటలకు సిద్ధం చేసుకుంటున్నారు. గతేడాది జలాశయం 19వ గేటు రైతులు ఆందోళన చెందారు. తక్షణమే మరమ్మతులు చేపట్టడంతో అన్నదాత ఊపిరి పీల్చుకున్నారు. పరిపూర్ణంగా కొత్త గేట్లు ఏర్పాటుచేసి, మరోసారి ఇబ్బంది రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు అధకారులు తెలిపారు.

అనర్హత ఎమ్మెల్యేలకు విముక్తి..!

- రేపు తుది నిర్ణయం తీసుకునే అవకాశం

బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాల్లో స్పీకర్‌స్థానం పట్ల అగౌరవంగా వ్యవహరించారని వేటువేసిన 18మంది ఎమ్మెల్యేల వివాదానికి త్వరలోనే ముక్తి లభించే అవకాశం ఉంది. ఈనెల 25న ఆదివారం ప్రత్యేక సభ జరగనుంది. సీఎం సిద్దరామయ్య, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్, ప్రతిపక్షనేత అశోక్‌ల సమక్షంలో స్పీకర్ యూటీ ఖాదర్ అధ్యక్షతన సభ జరగనుంది. సహకారశాఖ మంత్రి రాజణ్ణపై వచ్చిన హనీట్రాప్ వివాదంపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు పోడియంతోపాటు స్పీకర్ స్థానం వద్ద నిరసన తెలిపారు. ఈమేరకు 18మంది బీజేపీ ఎమ్మెల్యేపై 6 నెలలపాటు సస్పెన్షన్ వేటు వేశారు. ఇటీవల బీజేపీ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులుగా మా కర్తవ్యాల నిర్వహణకు సస్పెన్షన్ అడ్డుగా ఉందని స్పీకర్, ప్రభుత్వానికి సూచించాలని గవర్నర్‌కు విన్నవించారు. ఈ అంశంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. 25న ప్రత్యేక సభ జరపాలని నిర్ణయించారు. సభలో సీఎం సానుకూలంగా వ్యవహరిస్తే సస్పెన్షన్ వేటు తొలగే అవకాశం ఉంది.



సన్యాసం స్వీకరించిన షావుకారు

- వందకోట్లు వద్దనుకున్నాడు..!
- జైన దీక్ష స్వీకరించిన శ్రీమంతుడు
- నిన్నటిదాకా రూ.కోట్లాది రూపాయల వ్యాపారం.. ఇకపై భిక్షాటనతోనే జీవనం

బెంగళూరు, మే 23(ఆంధ్రజ్యోతి): రూ.కోట్ల ఆస్తిని కాదనుకుని సన్యాసాన్ని ఎంచుకున్నాడా శ్రీమంతుడు. యాదగిరిలో ఇటీవల జైన సన్యాసం స్వీకరించేవారు పెరుగుతున్నారు. యాదగిరి జైన్ కాలనీకి చెందిన నిఖిత అనే 26ఏళ్ల యువతి జైనముని అయిన విషయం తెలిసిందే. తాజాగా యాదగిరి తాలూకా సైదాపుర నివాసి దిలీప్‌కుమార్ ధోకా గురువారం జైన దీక్ష స్వీకరించారు. భార్య, ముగ్గురు కుమార్తెలతోపాటు వందకోట్లకుపైగా ఆస్తి కల్గిన ఆయన ఇక సన్యాసి జీవనం సాగించాలని నిర్ణయించుకున్నారు. దిలీప్‌కుమార్ ధోకా 12ఏళ్లుగా అమెరికాలో మెడిసిన్ ఉత్పత్తుల వ్యాపారాలు చేశారు. 55ఏళ్ల దిలీప్‌కుమార్ అతడికి 14ఏళ్ల వయసునప్పుడే జైనదీక్షకు సిద్ధమయ్యాడు. తల్లిదండ్రులు వారించడంతో వెనుకడుగు వేశారు. అయితే ప్రస్తుతం జైనదీక్ష స్వీకరించడం ద్వారా 41 ఏళ్లకిందటి ఆలోచనను అమలు చేసినట్లు అయ్యింది. జైనదీక్ష స్వీకరించే సందర్భంలో కుటుంబీకులు, బంధువులు భారీ ఊరేగింపు జరపడం ద్వారా వీడ్కోలు పలికారు. సైదాపుర పట్టణవీధుల్లో ఊరేగింపు జరిగింది. భార్య కంటతడిపెడుతూ వద్దని వేడుకున్నా ఒంటరిచేసి వెళ్లారని ఆవేదన వ్యక్తం చేసింది. జైనదీక్ష పొందితే భౌతిక ప్రపంచంతో ఎటువంటి సంబంధాలు పెట్టుకోరు. విలాసవంతమైన కార్లు, బంగళాలలో ఉండరు. తెలుపుదుస్తులు ధరిస్తారు. చెప్పులు వేసుకోరు. ఆధునిక సౌలభ్యాలను పాటించరు. ఇప్పటివరకు వ్యాపారంలో స్థిరపడి విలాసవంతమైన భవనం, కార్లు కల్గిన దిలీప్‌కుమార్ అన్నింటినీ వీడి సన్యాసం స్వీకరించారు. సన్యాసం స్వీకరించాక ఇంటింటికీ వెళ్లి భిక్ష స్వీకరించగా వచ్చిన వాటితో కడుపునింపుకోవాలి. ఇలా అన్నింటికీ సిద్ధమై దీక్ష స్వీకరించడం విశేషం. రూ. కోట్ల ఆస్తిని వదులుకోవడం చర్చనీయాంశంగా మారింది.



మీడియాతో దిలీప్‌కుమార్ ధోకా

మా పత్రిక.. మా నిధులు..

- నేషనల్ హెరాల్డ్ మా పార్టీ పత్రిక
- ట్రస్టు ద్వారా రూ.25లక్షలు ఇచ్చాం
- కుమారవి అర్థంలేని ఆరోపణలు: డీకే



బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ వివాదంలో డీసీఎం డీకే శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేశ్ పేర్లు ప్రస్తావనకు వచ్చిన సందర్భంలోనే డీకే శివకుమార్ స్పందించారు. విజయపుర జిల్లా కొల్హాడలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన నేషనల్ హెరాల్డ్ తమ పార్టీ నడిపించిన పత్రిక అన్నారు. అందుకు నా తమ్ముడు డీకే సురేశ్‌తోపాటు 25లక్షల రూపాయలు ఇచ్చామన్నారు. రూ.కోట్లు పెట్టుబడులు పెట్టాననడం అసత్యమన్నారు. తమ ట్రస్టు నుంచి కూడా విరాళం ఇచ్చామన్నారు. అబద్ధాలకు మరోపేరు కుమారస్వామి అన్నారు. ఆయన ఇంట్లోనే నేరాల పుట్ట ఉందన్నారు. బంగారం రవాణా వివాదాన్ని కాంగ్రెస్ వారే ఈడీకి ఫిర్యాదు చేశారనే అంశంపై స్పందిస్తూ ఆయన ఓ మెంటల్... మానసిక ఆరోగ్యం ఆయనకు బాలేదన్నారు. అందుకే ఇష్టానుసారం మాట్లాడుతూ అప్రతిష్ట పాలవుతున్నారన్నారు. ప్రతిపక్షాలకు కాంగ్రెస్‌నే విమ్శచడమే ధ్యేయమన్నారు. అర్థం పర్థం లేని ఆరోపణలు చేయడం తగదన్నారు.

72 గంటల్లో పరిహారం అందించాలి

8లో

- వరద సహాయక చర్యల్లో అప్రమత్తంగా ఉండాలి
- ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షాలు: జడ్పీ సీఈఓ

పడిపోయినా... విడిపోం..!

- లాల్‌బాగ్‌లో నేలకూలిన 150 ఏళ్ల నాటి భారీ వృక్షాలు
- 'వి' షేప్‌లో ఆకట్టుకున్న రావి, మర్రి చెట్లు
- తొలగింపు చర్యలు ప్రారంభించిన అధికారులు

లాల్‌బాగ్‌లో నేలకూలిన భారీ వృక్షాలు



బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): లాల్‌బాగ్ ఉద్యానవనంలో సుమారు 150ఏళ్ల నాటి భారీ వృక్షాలు నేలకొరిగాయి. రావి, మర్రిచెట్లు 'వీ' ఆకారంతో ఉండేవి. ఈ రెండుచెట్లు ఒకే చోటున ఉండి పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేవి. సందర్శకులు ఈ చెట్ల వద్ద ఫొటోలు దిగుతూ జ్ఞాపకాలు పదిలం చేసుకునేవారు. వందేళ్లకుపైగా ఉండడంతో ప్రత్యేక ఆకర్షణ అనిపించేది. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా రెండు చెట్లు నేలకూలాయి. చెట్ల కింద ఎవ్వరూ లేరని, ఎటువంటి నష్టం కలగలేదని ఉద్యానవనశాఖ జాయింట్ డైరెక్టర్ జగదీశ్ తెలిపారు. శనివారం తొలగింపు చర్యలు చేపడతామన్నారు.

పిట్ట కథ..!



ఆకలైతాంది.. అమ్మా నాయిన ఎప్పుడొస్తారో ఏమో..!



ఏమీ దొరకలేదు బుజ్జీ.. అట్లా అలిగితే ఎట్లా..?



పసిదానికి ఆకలైతాందంట.. ఏమైనా తెచ్చేదుందా.. లేదా..?



బుద్ధి లేక పెండ్లి చేసుకుందా..! పోతాండా ఉండు..!



ఇదిగో తెచ్చినా.. తిను..!



అంతేలే.. మీరు మీరు పాముకోండి..!



నిన్ని ఇడిసిపెట్టి ఎట్ల తింటా చెప్పు బుజ్జీ..? ఇది నీకే..

(బుక్కరాయసముద్రం చెరువులో..)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

బదిలీలపై ఉత్కంఠ!

అనుకూల ప్లేస్‌ల కోసం ఉద్యోగుల యత్నాలు

ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు

ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు

అయినా.. దక్కుతుందో లేదోనన్న సందేహాలు



అనంతపురం టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు పచ్చజెండా ఊపింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక కొన్ని బదిలీలు జరిగినా అపుడు వివిధ మార్గదర్శకాలు అమలు చేయడంతో అనుకున్నవారు రాలేకపోయారు. ఎవరనీ కదపలేకపోయారు కూడా. దీంతో వైసీపీ హయాంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులే చాలా శాఖల్లో ఉంటూ హవా సాగిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏ పనిచెప్పినా చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఇదే విషయంపై ప్రజాప్రతినిధుల వద్ద టీడీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇపుడు మొత్తం అన్నిశాఖల బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పుడైనా తమకు అనుకూలమైన వారిని నియమించుకోవాలని ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు ఆరాట పడుతున్నాయి. అధికారులు, ఉద్యోగులు సైతం తమకు అనుకూలమైన ప్లేస్‌లకు వెళ్లేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ కొనసాగుతున్నా.. ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, జడ్పీ, ఎంపీడీఓలు, వివిధ శాఖల ఇంజనీర్లు తీవ్రప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. దీంతో ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తీసుకుని, ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావారీగా రెవెన్యూ బదిలీలు

కీలకమైన శాఖ రెవెన్యూ. దీంతో ప్రజాప్రతినిధులు కూడా ఈ శాఖలో తమకు అనుకూలంగా ఉండేవారినే నియమించుకుంటారు. ఎంపీడీఓల నియామకంపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఈ బదిలీలు ఉమ్మడి జిల్లావారీగా చేపట్టనున్నారు. రెవెన్యూశాఖ బదిలీలే హాట్‌టాపిక్‌గా మారాయి. ఆ బదిలీలకు ఉమ్మడి అనంత జిల్లా కలెక్టరే చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కింది స్థాయి కేడర్ల బదిలీలు జాయింట్ కలెక్టర్, డీఆర్వో ఆధ్వర్యంలో చేపడతారు. ఆ మేరకు బదిలీలు చేయడానికి యంత్రాంగం కసరత్తు మొదలెట్టింది.

ఆశావహుల్లో ఉత్కంఠ

బదిలీలపై పెద్దఎత్తున పైరవీలు చేయించుకుంటుంటే కలెక్టర్ వినోద్‌కుమార్ మాత్రం నిబంధనల మేరకే చేస్తామని చెబుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొన్నిశాఖల్లో బదిలీలు జరిగినపుడు కూడా జిల్లాలో నేతలు ప్రతిపాదించిన వారికి పోస్టింగ్స్ ఇవ్వలేదు. అప్పట్లో దీనిపై ప్రజాప్రతినిధుల నుంచి కూడా అసంతృప్తి వ్యక్తమైంది. అప్పటికప్పుడు కొందరి పోస్టింగ్‌లను మార్చి ఇచ్చారు. ఇపుడు మళ్లీ కలెక్టర్, జేసీ నిబంధనలు అంటూ సిఫార్సు లేఖలను పక్కనపెడతారేమోనన్న ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో తాము కోరుకున్న స్థానాన్ని దక్కించుకునేందుకు అధికార పార్టీ నేతల నుంచి ఉన్నతాధికారులపై ఒత్తిడి పెట్టిస్తున్నారు. ఏం జరుగుతుందో చూడాలి మరి.

ఉద్యోగం వదిలి సేద్యపు బాట



గోపాల్‌రెడ్డి

• సేంద్రియ పద్ధతిలో అరటి సాగు • లాభాలు గడిస్తున్న మంగాపురం రైతు



సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన బొప్పాయి

పెనుకొండ రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై మక్కువ ఉన్నా తీవ్ర కరువు నేపథ్యంలో సాగు నీరు లేక ఓ యువకుడు పొట్టకూటి కోసం వలస వెళ్లాడు. కాల ప్రవాహంలో రెండు దశాబ్దాలు గడిచిపోయాయి. జిల్లాకు హంద్రీ నీవా ద్వారా కృష్ణా జలాలు రావడం, గొలపల్లి రిజర్వాయర్ నిర్మాణంతో సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో యువకుడిగా వెళ్లిన ఆయన నడివయసులో స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. సేంద్రియ సేద్యం ప్రారంభించాడు. లాభాలు గడిస్తూ పలువురికి ఆదర్శంగా మారాడు. ఆయనే మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డి.

బెంగళూరు నుంచి వచ్చి..

గ్రామంలో కరువు పరిస్థితులు ఉండటంతో రెండు దశాబ్దాల కిందట గోపాల్‌రెడ్డి బెంగళూరుకు వలస వెళ్లాడు. అక్కడ మెడికల్ పీఆర్‌ఓగా పని చేసేవాడు. నెలకు రూ.30 వేలదాకా జీతం లభించేది. మనసు మాత్రం ఎప్పుడు ఊరిపైనే ఉండేది. ఈక్రమంలోనే జిల్లాలో పరిస్థితులు మారాయి. కృష్ణా జలాలతో చాలా ప్రాంతం సస్యశ్యామలం కాసాగింది. ఇది గమనించిన గోపాల్‌రెడ్డి రెండేళ్ల కిందట ఉద్యోగాన్ని వదిలి స్వగ్రామం చేరుకున్నాడు. తనకున్న 3.5ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో అరటి సాగు చేశాడు. దిగుబడులు బాగా రావడమే కాకుండా గిట్టుబాటు ధర లభించడంతో వ్యవసాయం లాభసాటిగా మారింది. అరటిలో అంతర పంటలుగా బొప్పాయి, మామిడి, డ్రాగన్‌ఫ్రూట్, మునగ, కంది, వక్క సాగుచేశాడు. ఒక్కో అరటి మొక్కను రూ.30చొప్పున కొనుగోలు చేసి 2వేల మొక్కలు నాటాడు. పంట సాగు, కూలీలు, ఎరువుల కోసం దాదాపు రూ.2.10లక్షలు ఖర్చుచేశాడు. పంట దిగుబడి బాగా వచ్చిందన్నారు. ఒక్కో గెల 8కిలోల నుంచి 12కిలోలు వచ్చిందన్నారు. ఇప్పటిదాకా పెట్టుబడి మొత్తం వచ్చిందన్నారు. ఇంకా రెండు మూడు కోతలు వస్తాయని, అదంతా అదనపు లాభమేనని ఆనందం వ్యక్తం చేశారు.

అరటిలో లాభాలు బాగున్నాయ్

గతంలో నేను బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో పీఆర్‌ఓగా పని చేసేవాడిని. రూ.30వేలు జీతం వచ్చేది. ఆ ఉద్యోగానికి స్వస్తి చెప్పి నాకున్న సొంత భూమిలో సేంద్రియ పద్ధతిలో అరటి, బొప్పాయి, వక్క ఇలా తొమ్మిది రకాల పంటలను సాగుచేశా. యాలక్కి రకం అరటి సాగులో నాలుగుసార్లు కోత కోయగా 5టన్నులు దిగుబడి వచ్చింది. కిలో రూ.40నుంచి రూ.50దాకా పలికింది. పెట్టుబడులు అన్నీ వచ్చేశాయి. ఇంకా మూడు కోతలు అవుతాయి. అదంతా లాభమే.

- గోపాల్‌రెడ్డి, రైతు



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన అరటి గెలలు



స్వరూప్



సాయికుమార్



విరూపాక్షరెడ్డి



రాజు

గ్రేడ్-2 వీఆర్వోల జిల్లా కమిటీ ఎంపిక

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సాయికుమార్, విరూపాక్షరెడ్డి

అనంతపురం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా కార్యవర్గం ఎంపిక జరిగింది. జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిరంలోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం అసోసియేషన్ జిల్లా అడహక్ కమిటీని ఎంపిక చేశారు. ఇదే సందర్భంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి స్వరూప్, జిల్లా అధ్యక్షులు సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా విరూపాక్షరెడ్డి కోశాధికారిగా రాజు, వైస్‌ప్రెసిడెంట్లుగా నరేష్‌కుమార్, కుమారస్వామి, రాఘవేంద్రరాజు, సహాయ కార్యదర్శులుగా అనిల్, అశోక్‌కుమార్, రఘుయాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పురుషోత్తం, లిఖిత, ఈసీ మెంబర్లుగా సయ్యద్, ఆఫ్రిది, వెంకట రాజేష్, దిల్షాద్, వీరేష్, ఆదినారాయణ, నీలకంఠరెడ్డిలను ఎంపిక చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి స్వరూప్ మాట్లాడుతూ జిల్లా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. జిల్లాలో త్వరితగతిన సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపడతామన్నారు. డివిజన్ కమిటీలు పూర్తి చేస్తామని వెల్లడించారు.

స్త్రీనిధి మేనేజర్‌గా సాగర్

అనంతపురం క్లాక్‌టవర్, మే 23 (ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి మేనేజర్‌గా సాగర్ నియమితులయ్యారు. డీఆర్‌డీఏ-వెలుగులో స్త్రీనిధి విభాగం అత్యంత కీలకం. స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇవ్వడంలో స్త్రీనిధి ముందుంటుంది. ఇదివరకు స్త్రీనిధి మేనేజర్‌గా ఉన్న హనుమేష్‌ను శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు. కర్నూలులో స్త్రీనిధి మేనేజర్‌గా ఉన్న సాగర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ శైలజను సాగర్ మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త..

- లూజు విత్తనాలు సిద్ధం చేసుకున్న దళారులు
- రైతులకు అంటగట్టే ప్రయత్నాలు
- వాటిని కొంటే నష్టాలే..
- ధ్రువీకరించిన, ప్యాక్డ్ విత్తనాలే కొనాలంటున్న వ్యవసాయాధికారులు



వరి విత్తనాలు

బొమ్మనహాళ్, మే23(ఆంధ్రజ్యోతి): ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కూడా ముందుగానే ప్రారంభమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మండలంలో రైతులు, వరి, మిరప, వేరుశనగ తదితర పంటల సాగుకు విత్తనాలు సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. సాగులో కీలకమైన విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు వహించాల్సి ఉంది. లూజు విత్తనాలను అమ్మేందుకు దళారులు సిద్ధమవుతుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లూజు విత్తనాలకు బదులు ప్యాకెట్‌లో ఉన్న వాటిని కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. గతంలో బొల్లనగుడ్డం, దర్గాహొన్నూరు గ్రామాల్లో పొద్దుతిరుగుడు, సజ్జ నకిలీ విత్తనాల కారణంగా పంటలు దెబ్బతిని, రైతులు తీవ్రంగా నష్టపోయారు. కర్ణాటక నుంచి నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకుని, ఇక్కడి రైతులకు అంటగడతారని తెలుస్తోంది. కర్ణాటక, చెన్నై, ప్రాంతాల నుంచి పలు రకాల కంపెనీలకు చెందిన కవర్లను తీసుకొచ్చి, వాటిలో నింపి, రైతులకు విక్రయిస్తుంటారు. కొన్నేళ్లుగా వ్యవసాయ శాఖాధికారులు రవాణా మధ్యలోనే చర్యలు తీసుకుంటుండడంతో నకిలీ సమస్య కొంత తగ్గింది. కొందరు దళారులు మళ్లీ లూజు విత్తనాలు విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


లూజు విత్తనాలైతే..

ప్యాకెట్లలో కాకుండా విడిగా విత్తనాలను కొనుగోలు చేస్తే వాటిలో నాణ్యత ఉండదు. ఈ విత్తనాల తయారీలో కంపెనీకి చెందిన ధృవీకరణ అధికారుల ప్రమేయం ఉండదు. లూజు విక్రయాలు జరిపేవారు రైతులకు బిల్లు ఇవ్వరు. విత్తన శుద్ధి, ఇతర ప్రమాణాలు పాటించరు. ఆ విత్తనాలు సాగుచేసినపుడు పంట మధ్యలో పూత, కోత దశల్లో దెబ్బతింటే విక్రయించిన వారు బాధ్యత వహించారు. రైతులకు నష్టం తప్పదు.

గుర్తింపు పొందిన కంపెనీలవే కొనాలి

వ్యవసాయశాఖ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలనే రైతులు కొనుగోలు చేయాలి. ఆ విత్తనాల తయారీలో వివిధ దశల్లో ధ్రువీకరణ అధికారులు ఉంటారు. విత్తన నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లు తప్పక ఇస్తారు. ఆ తరువాత రైతులకు నష్టం వాటిల్లితే పరిహారం వచ్చే ఆవకాశం ఉంటుంది. వ్యవసాయ శాఖ సిబ్బందితో అనుమతి పొందిన లైసెన్సడ్ దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేయాలి. వ్యాపారి నుంచి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. పంటకాలం పూర్తయ్యేవరకు వాటిని జాగ్రత్తగా ఉంచుకోవాలి.


రైతులు జాగ్రత్తలు పాటించాలి



గ్రామీణ ప్రాంతాల్లో చాలావరకు కర్ణాటకలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి లూజు విత్తనాలను తెచ్చుకుంటున్నారు. అలాంటి విత్తనాలను కొనుగోలు చేయరాదు. గ్రామాల్లోకి వచ్చి ఎవరైనా అక్రమంగా లూజు విత్తనాలు, వివిధ కంపెనీల విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. అలాంటి వారు గ్రామాలకు వస్తే సమాచారం ఇవ్వండి. విత్తన కొనుగోలులో జాగ్రత్తలు పాటిస్తే సాగుకు ముందే వాటిల్లే నష్టాన్ని రైతులు నివారించుకోవచ్చు.

-సాయికుమార్, ఏఓ, బొమ్మనహాళ్

విత్తన సబ్సిడీ ఖరారు



అనంతపురం అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి పలురకాల విత్తనాలకు ప్రభుత్వం సబ్సిడీ ధరలు ఖరారు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మినుములు, పెసలు, కంది, నువ్వుల విత్తనాలకు 30 శాతం సబ్సిడీ, కొర్ర, రాగులకు 50 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. బీపీటీ-5204 రకం వరి క్వింటాల్ పూర్తి ధర రూ.4300లుగా నిర్ణయించారు. ఇందులో జాతీయ ఆహార భద్రత పథకం కింద రూ.1000 సబ్సిడీ, ఇతర రైతులకు రూ.500 సబ్సిడీ వర్తింపజేశారు. మినుములు పూర్తి ధర రూ.13800లుగా నిర్ణయించారు. ఇందులో రూ.4140లు సబ్సిడీపోను రైతు వాటా రూ.9660 చెల్లించాలి. పెసలు క్వింటాల్ పూర్తి ధర రూ.13500లుగా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీ రూ.4050లుపోను రైతు వాటా రూ.9450లు చెల్లించాలి. కంది క్వింటాల్ పూర్తి ధర రూ.10950లుగా నిర్ణయించారు. ఇందులో రూ.3285లు సబ్సిడీపోను రైతు వాటా రూ.7665లు చెల్లించాలి. కొర్ర క్వింటా పూర్తి ధర రూ.6000లుగా నిర్ణయించారు. ఇందులో రూ.3000లు సబ్సిడీపోను రైతు వాటా రూ.3000లు చెల్లించాలి. రాగి క్వింటా పూర్తి ధర రూ.6900లుగా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీ రూ.3450లుపోను రైతు వాటా రూ.3450లు చెల్లించాలి. నువ్వులు క్వింటా పూర్తి ధర రూ.15500లుగా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీ రూ.6200లుపోను రైతు వాటా రూ.9300లు చెల్లించాలి. అలాగే వరి (25 కేజీల బ్యాగ్)ఐదు ఎకరాల దాకా 4 బ్యాగ్‌లు పంపిణీ చేస్తారు. కంది (4 కేజీల బ్యాగ్) ఐదు ఎకరాల దాకా 10 బ్యాగ్‌లు, ఉలవలు (4 కేజీల బ్యాగ్) ఐదెఎకరాల దాకా 10 బ్యాగ్‌లు, పెసలు (4 కేజీల బ్యాగ్) ఐదు ఎకరాల దాకా 10 బ్యాగ్‌లు, కొర్ర (2 కేజీల బ్యాగ్) ఐదు ఎకరాల దాకా 5 బ్యాగ్‌లు, రాగి, నువ్వులు, (2 కేజీల బ్యాగ్) ఐదు ఎకరాల దాకా 6 బ్యాగ్‌లు పంపిణీ చేస్తారు.

ఉన్నతి స్థానం

రుణాల రికవరీలో జిల్లాకు సెకెండ్ ప్లేస్




సెర్ప్ సీఈఓ నుంచి అవార్డు అందుకుంటున్న ఉన్నత ఏపీఎం మంజుల

అనంతపురం క్లాక్‌టవర్, మే 23(ఆంధ్రజ్యోతి): ఉన్నతి ఎస్సీ, ఎస్టీ రుణాల రికవరీలో జిల్లాకు ద్వితీయ స్థానం దక్కింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో డీఆర్‌డీఏ-వెలుగు ద్వారా స్వయం సహాయక సంఘాల ఎస్సీ, ఎస్టీ మహిళల నుంచి ఉన్నతి రుణాలు రికవరీ చేయడంలో మెరుగైన పురోగతి సాధించారు. జిల్లాలో పేరుకుపోయిన రూ.25.24కోట్ల రుణాలలో 2024 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2025 మార్చి 31లోపు ఏడాదిలోనే రూ.15.47కోట్లు రుణాలు రికవరీ చేశారు. దీంతో రాష్ట్రంలో ద్వితీయ స్థానం దక్కింది. ఇటీవల రాజధాని అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ నుంచి డీఆర్‌డీఏ ఉన్నతి ఏపీఎం మంజుల అవార్డు అందుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ శైలజ అవార్డు అందుకున్న ఏపీఎం మంజులను అభినందించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

రాజ్‌దీప్ సర్దేశాయి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత రాజ్‌దీప్ సర్దేశాయి 1965 మే 24న అహ్మదాబాద్‌లో జన్మించారు. పాత్రికేయుడు, రచయిత, న్యూస్ యాంకర్‌గా రాణించారు. 'దీపశిఖ' కలం పేరిట కథనాలు అందిస్తున్నారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక ముంబై విభాగానికి ఎడిటర్‌గా పనిచేశారు. బుల్లితెరపై ఎన్‌డీటీవీలో పొలిటికల్ ఎడిటర్‌గా వ్యవహరించారు. తర్వాత సొంతంగా సీఎన్ఎన్-ఐబీఎన్ చానెల్ స్థాపించి ఎడిటర్-ఇన్-చీఫ్‌గా 2014వరకు కొనసాగారు. 2006లో రామ్‌నాథ్ గోయెంకా ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం అవార్డ్, 2008లో 'పద్మశ్రీ', 2020లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ ఇన్ ఈఎన్‌బీఏ, తదితర పురస్కారాలు అందుకున్నారు. ప్రస్తుతం ఆయన 'ఇండియా టుడే టెలివిజన్'కు కన్సల్టింగ్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

బాబ్ డైలాన్ (పుట్టినరోజు)



'నోబెల్ పురస్కార' గ్రహీత బాబ్ డైలాన్ 1941 మే 24న జన్మించారు. అమెరికాకు చెందిన గాయకుడు, గేయ రచయితగానే కాకుండా రచయిత, విజువల్ ఆర్టిస్ట్‌గా రాణించారు. 60ఏళ్ల కెరీర్‌లో 100 మిలియన్‌లకుపైగా రికార్డులు విక్రయాలు చేసి 'బెస్ట్ సెల్లింగ్ మ్యూజీషియన్స్ ఆఫ్ ఆల్ టైమ్'గా పేరొందారు. 1960లో సివిల్ రైట్స్, యాంటివార్ కదలికలపై రాసిన గేయాలు ఎంతో గుర్తింపు తెచ్చాయి. 10 గ్రామీ అవార్డులు, గోల్డెన్ గ్లోబ్ అవార్డు, 2016లో సాహిత్యంపై 'నోబెల్ పురస్కారం', రాక్ అండ్ రోల్ హాల్ ఆఫ్ ఫేంలో గుర్తింపు, ఇతర అవార్డులు అందుకున్నారు.

బేకరీలో నగదు చోరీ

చింతామణి, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే కేఎస్ఆర్టీసీ బస్టాండ్, బెంగళూరు డబుల్ రోడ్డు మార్గంలో బెంగళూరు సర్కిల్‌లో గల కెకె నెస్ట్ బేకరీలో దొంగలు పడ్డారు. బేకరీ వెనుక వైపున ఉండే ఎగ్జాస్ట్ ఫ్యాన్ కిటికీని నాశనం చేసి చొరబడ్డారు. గురువారం రాత్రి జరిగిన సంఘటనలో సుమారు రూ.25వేల నగదు చోరీకి గురైనట్టు బేకరీ యజమాని వెంకటేశ్ ఫిర్యాదు చేశారు. శుక్రవారం యథాప్రకారం దుకాణం తెరవగా చోరీ జరిగిన విషయం గుర్తించినట్టు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చింతామణి పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలోని దుకాణంలో చోరీ జరగడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

ఉద్యోగుల నిరసన

రాయచూరు, మే 23(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన రైతు సంఘం నాయకుడి పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేశారు. కర్ణాటక రైతు సంఘం, హసిరు సేనల గౌరవాధ్యక్షుడు చామరస మాలిపాటిల్ మాన్విలో ఆహార శాఖ డిప్యూటీ డైరెక్టర్, కర్ణాటక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ శావంతగేరి పట్ల చేసిన వ్యాఖ్యలు ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేదిగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సంఘం నాయకుడు చామరస మాలిపాటిల్ వ్యాఖ్యలను నిరసిస్తు ప్రభుత్వ ఉద్యోగులు శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు జొన్నల కొనుగోలుకు సంబంధించి కేంద్రాల ఏర్పాటు కోసం రైతులు ధర్నా చేయగా జిల్లాధికారి ఆదేశాల మేరకు అక్కడికి వెళ్లిన ఆహార శాఖ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణ శావంతగేరి రైతుల నుంచి వినతి పత్రం తీసుకునే సందర్భంలో చామరస మాలిపాటిల్ ప్రజలురైతుల ఎదురుగానే ఉద్యోగి పట్ల చేసిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయన్నారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల ఉద్యోగులు ఆత్మన్యూన్నత భావానికి గురయ్యే ప్రమాదం ఉందని ఉద్యోగులకు రక్షణ కల్పించాలని బాధ్యుడైన నాయకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

పాఠశాల పునఃప్రారంభించాలని డిమాండ్

▸▸ తిమ్మాపురలో ఐదేళ్లుగా మూతబడిన ప్రభుత్వ స్కూల్



మాజీ ఉపాధ్యక్షుడు నరసింహప్ప



తిమ్మాపురలో మూతపడిన ప్రభుత్వ పాఠశాల

ముళబాగిలు, మే 23 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మల్లనాయకనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని తిమ్మాపుర గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఐదేళ్లక్రితం పిల్లలు లేరనే కారణంతో విద్యాశాఖ మూసివేసింది. ప్రస్తుతం గ్రామంలో పిల్లలు ఉండడంతో పునఃప్రారంభించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. 20ఏళ్లక్రితం ఆలంగూరు సి చంగేగౌడ దానంగా ఇచ్చిన స్థలంలో అప్పటి ఎమ్మెల్యే ఆలంగూరు శ్రీనివాస్ పాఠశాలను ప్రారంభించారు. క్రమేపీ విద్యార్థుల సంఖ్య పెరిగారు. అయితే ప్రైవేట్ పాఠశాలలు తలెత్తాక ఇక్కడ అడ్మిషన్లు తగ్గాయి. ఇలా ఐదేళ్లక్రితం పాఠశాలను మూసివేశారు.

ప్రస్తుతం పదిమందికిపైగా పిల్లలు

ప్రస్తుతం గ్రామంలో ఒకటో తరగతిలో చేరే పిల్లలు ఉన్నారు. పాఠశాల మూసివేయడంతో పదిమందికిపైగా విద్యార్థులు 1.5 కిలోమీటరు దూరంలోని మల్లనాయకనహళ్ళి ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనైనా పాఠశాలను పునఃప్రారంభిస్తే విద్యార్థులంతా ఇదే పాఠశాలలో చేరేందుకు అవకాశం ఉంది. గ్రామంలో అనేకమంది కూలి పనిచేసి జీవనం సాగించేవారే. అయినా కూడా పిల్లలకు ఉత్తమ విద్య అందించాలనే వారి ఆశయానికి గ్రామంలోనే పాఠశాలను తెరవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. విద్యాశాఖ అధికారులు గ్రామాన్ని సందర్శించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం కూడా లేదు..

ఈ గ్రామంలో 250మందికి పైగా జనాభా ఉన్నారు. ఆరేళ్లలోపు వారు 11మంది ఉన్నా ఇంతవరకు అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం కాలేదు. దీంతో పిల్లలు అక్షరాలు నేర్చుకునేందుకు దూరమవుతున్నారు. గ్రామపంచాయతీ మాజీ ఉపాధ్యక్షుడు నరసింహప్ప మాట్లాడుతూ తిమ్మాపుర గ్రామంలో పిల్లలకు అనుకూలంగా మూసివేసిన పాఠశాలను పునఃప్రారంభించాలని విద్యాశాఖ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించాలని కోరారు. బీఈఓ కేఎన్ రామచంద్ర మాట్లాడుతూ తిమ్మాపుర గ్రామానికి సీఆర్‌పీని పంపి అక్కడి విద్యార్థుల సమాచారం సేకరించిన అనంతరం ప్రభుత్వ ఆదేశిస్తే పాఠశాలను పునఃప్రారంభించే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయుడిని నియామకం చేయడం ద్వారా ఇక్కడికి ఉత్తమ విద్య సాధ్యమన్నారు. సీడీపీఓ శోభా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 400మంది జనాభా ఉండే ప్రాంతాలలో అంగన్‌వాడీ కేంద్రం తెరిచే అవకాశం ఉందన్నారు. తిమ్మాపుర గ్రామంలో ఆరేళ్లలోపు పిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు అంశం శాఖ దృష్టికి తీసుకొస్తామన్నారు.

అభివృద్ధికే ప్రాధాన్యం: ఎమ్మెల్యే



గ్రామసభలో ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆరోపణలకంటే అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, కోముల్, డీసీసీ బ్యాంకులో ఒక వర్గం ఎస్సీ, ఎస్టీలకు సహకారరంగంలో అవకాశం కల్పించరాదని డిమాండ్ ఉందనే ఆరోపణలను ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తోసిపుచ్చారు. తాలూ కాలోని ఐనూర హొసహళ్ళిలో శుక్రవారం ఏర్పాటైన గ్రామసభలో పాల్గొని మాట్లాడుతూ కోలారు జిల్లాలో రుణాలు పొందిన పాడిరైతులు, వడ్డీ రహిత రుణాలు పొందిన మహిళలు , రైతుల సహకారం ఉన్నంతవరకు ఎవరూ ఏమి చేయలేరన్నారు. అందరికీ సమానత్వం, అందరికీ భాగస్వామ్యం అనే ఉద్దేశ్యంతో ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసి పేదల స్వావలంబనకు శ్రమిస్తున్నట్టు తెలిపారు. బంగారపేట రైల్వేగేట్ నుంచి బంగారపేట సరిహద్దు వరకు 7మీటర్ల వెడల్పుతో రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.7కోట్లు మంజూరు చేశారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. కాగా గ్రామపంచాయతీలో ఆస్తిపన్ను తప్పక చెల్లించాలన్నారు. సమావేశంలో ఈఓ రవికుమార్, అధ్యక్షుడు కేజీ మంజునాథ్, ఉపాధ్యక్షురాలు శ్వేతా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

10వేల మొక్కలు నాటాలి..



సమావేశంలో ఉగ్రప్ప, టీ వాసుదేవరెడ్డి

బొమ్మనహళ్ళి, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్ఎస్ఆర్ స్వాభిమాన పార్కులో వివిధ రకాలైన 10వేల మొక్కలను నాటే లక్ష్యం కల్గినట్టు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ ఉగ్రప్ప తెలిపారు. శుక్రవారం పార్కులో సన్నాహకసభలో ఆయన మాట్లాడుతూ ఎక్కువగా నీడనిచ్చే చెట్లు, పండ్లు ఇచ్చే రకాలు నాటదలచినట్టు తెలిపారు. స్థానికంగా ఎక్కువసంఖ్యలో వాకింగ్ వచ్చే ఈ పార్కును మరింత అభివృద్ధి చేయదలిచామన్నారు. గతేడాది సీఎం సిద్దరామయ్య విచ్చేశారన్నారు. ఈసారి కూడా సీఎం రానున్నారన్నారు. సమావేశంలో హెచ్ఎస్ఆర్ బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు, గ్యారంటీ పథకాల కమిటీ బొమ్మనహళ్ళి అధ్యక్షుడు టీ వాసుదేవరెడ్డి, కాంగ్రెస్ ప్రచార సమితి సభ్యుడు కే వాసుదేవరెడ్డి, యూత్‌కాంగ్రెస్ నాయకుడు అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్జాపుర గ్రామపంచాయతీ అధ్యక్షురాలిగా కళావతి



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

దొమ్మసంద్ర, మే 23(ఆంధ్రజ్యోతి): సర్జాపుర గ్రామపంచాయతీ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ ఎన్ కళావతి మూర్తికుమార్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎస్ మంజునాథ్ సర్జా ఎన్నికయ్యారు. అధ్యక్షురాలిగా వ్యవహరించిన మమతా, ఉపాధ్యక్షులుగా వ్యవహరించిన ఓంశక్తి మంజునాథ్‌ల రాజీనామాతో తలెత్తిన స్థానాలకు శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షస్థానానికి బీజేపీ మద్దతుదారురాలు సరస్వతమ్మ, కాంగ్రెస్ మద్దతుదారురాలు డాక్టర్ ఎన్ కళావతిమూర్తి కుమార్ నామినేషన్ సమర్పించారు. కళావతి 20 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. సరస్వతికి 9 ఓట్లు దక్కాయి. ఉపాధ్యక్షస్థానానికి మంజునాథ్ సర్జా మాత్రమే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్జాపుర గ్రామపంచాయతీ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను కాంగ్రెస్ నాయకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యకర్తలు భారీ గజమాలతో సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు శంభయ్య, శ్రీనివాస్, ఎస్‌వీ వెంకటేశ, సునితా శశిధర్, మమతా రమేశ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రీవాల్యుయేషన్‌లో రాష్ట్రస్థాయి ఫస్ట్‌ర్యాంకు

చింతామణి, మే 23(ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరానికి ఎస్ఎస్ఎల్‌సీలో చింతామణి పట్టణం అంజని లే అవుట్‌లోని రాయల్ హైస్కూల్ ఉత్తమ ఫలితాలు సాధించింది. తాజాగా రీవాల్యు యేషన్‌లో ఒక విద్యార్థిని 625కు 625 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ఫస్ట్‌ర్యాంకర్‌గా నిలిచింది. విద్యార్థిని అమార కౌసర్‌కు 625 కు 622 మార్కు లతో మూడోర్యాంకులో నిలిచింది. కన్నడలో 125కు 122, ఇతర సబ్జెక్టులలో 100కు 100 మార్కులు సాధించారు. దీంతో కన్నడ టీచర్ కృష్ణమూర్తి సూచన మేరకు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా కన్నడలో 125కు 125 వచ్చి రాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచారు. పాఠశాల అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి ప్రేమలతా తదితరులు బాలికలను ఆత్మీయంగా సత్కరించారు.

రెండోర్యాంకు...

బాగేపల్లి: ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలలో రీవాల్యుయేషన్ అనంతరం మార్కులు పెరగడంతో ఇద్దరు విద్యార్థినులు స్పందన, రాజరాజేశ్వరిలను పట్టణంలో శుక్రవారం ప్రత్యేకంగా సత్కరించారు. బాగేపల్లి పట్టణంలోని ప్రముఖ బిజిఎస్ పాఠశాల విద్యార్థిని స్పందన రాష్ట్రస్థాయిలో రెండోర్యాంకు సాధించారు. 3 మార్కుల తేడాతో వెనుకంజలో ఉన్న బాలిక, రీవాల్యుయేషన్‌లో 625కు 624 మార్కులు పొంది స్టేట్ రెండోర్యాంకు దక్కించుకున్నారు. కన్నడలో 125కు 124, సైన్స్‌లో 100కు 98 మార్కులు సాధించగా రీ వాల్యుయేషన్ అనంతరం కన్నడలో 1, సైన్స్‌లో 2 మార్కులు అదనంగా సాధించగలిగారు. ఆమె తండ్రి వెంకటరమణా రెడ్డి, తల్లి రత్నమ్మలు హర్షం వ్యక్తం చేశారు. మరో విద్యార్థిని రాజ రాజేశ్వరి బీహెచ్ రీవాల్యుయేషన్‌లో 625కు 623 మార్కు లు సాధించారు. ఈమె పట్టణంలోని హేమ చంద్ర, పార్వతిల కుమార్తె. విద్యార్థినుల సాధనపట్ల ఉపాధ్యాయులు, పాఠశాల బృందం ప్రశంసిం చారు. సీఐ ప్రశాంత్‌వర్ణి వారిని ప్రత్యేకంగా అభి నందించారు. ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ప్రిన్సిపాల్ మునిరాజు, శ్రీనివాస రెడ్డి, రేఖ, గంగాధర తదితరులు పాల్గొన్నారు.



కౌసర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు



బాగేపల్లిలో విద్యార్థినులకు సత్కారం

వైభవంగా ప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



వీరాంజనేయస్వామికి విశేష అలంకరణ

శిడ్లఘట్ట, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మయూర సర్కిల్‌లో గల ప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయ పదో వార్షికోత్సవం, హనుమ జయంతి పురస్కరించుకుని రెండు రోజులపాటు విశేషపూజలు కొనసాగాయి. అశ్వత్థకట్ట ఆవరణలో నాగదేవతలకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సుప్రభాత సేవ, ఆలయశుద్ధితో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి మహాభిషేకం నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు. ఆలయంలోని దేవతామూర్తులకు తులసి తోరణాలు వేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని భజనలు, కీర్తనలు ఆలపించారు. ఆలయ ధర్మకర్త, సేవాకర్తలు, వివిధ పార్టీల ప్రముఖులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండగా ఉంటాం

▸▸ ప్రగతి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మునేశ్



ఇంటిని ప్రారంభిస్తున్న ట్రస్టు అధ్యక్షుడు మునేశ్ తదితరులు

ముళబాగిలు, మే 23(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని నిరాశ్రయులకు అండగా ఉంటామని, ఇప్పటివరకు 11 కుటుంబాలకు ఇళ్లు నిర్మించామని రానున్న రోజుల్లో మరింతమందికి ఇళ్లు నిర్మిస్తామని ప్రగతి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు జోగుళకాష్ఠి మునేశ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని మల్లనాయకనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని తిమ్మాపురలో గంగరత్నమ్మ, శంకరప్పలకు ట్రస్టు తరపున ఇల్లు నిర్మించి శుక్రవారం లాంఛనంగా అప్పగించారు. ఈ సందర్భంగా మునేశ్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా గుడిసెలో ఉంటున్నవీరికి ట్రస్టు తరపున చేయూత అందించామన్నారు. ట్రస్టు తరపున ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకారం అందిస్తున్నామని, నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థికసాయం చేస్తామన్నారు. బెంగళూరులో అనాథ పిల్లలకోసం పాఠశాలను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి తమవంతు సాయం చేస్తున్నామన్నారు. కాగా రైతులకు దేశవాళీ విత్తనాలు అందించే విధానం మూడేళ్లుగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మామిడి అభివృద్ధి మండలి మాజీ అధ్యక్షుడు కేఎం వాసుదేవ్ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా మునేశ్ చేస్తున్న సామాజిక సేవలు ఇతరులకు స్ఫూర్తిగా ఉంటాయన్నారు. ఆర్ఎస్ఎస్ నారాయణప్ప మాటాడుతూ గ్రామస్తులు ఐకమత్యంగా ముందుకు సాగితే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చునన్నారు. పిల్లలను బాగా చదివించాలన్నారు. గంగమ్మ భజనామండలి ఆధ్వర్యంలో జానపద గీతాలు ఆలపించారు. గ్రామస్థులు మునేశ్‌ను ఆత్మీయంగా సత్కరించారు. జిల్లాజనజాగృతి సమితి సభ్యుడు అరివు ప్రభాకర్, గ్రామపంచాయతీ మాజీ ఉపాధ్యక్షుడు నరసింహప్ప, నాగరాజ్, రెడ్డెప్ప, మహిళా సంఘం సమాఖ్య డైరెక్టర్ పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేశీయ వైద్యవిద్య పరిశోధనాత్మకం కావాలి

బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): దేశీయ వైద్యవిద్య పరిశోధనాత్మకం కావాలని గ్లోబల్ హెల్త్‌కేర్ అకాడమీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ బీఎస్ అజయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. గ్లోబల్ హెల్త్ అకాడమీ మెడికల్ పీజీ చేయదలచుకున్నవారి కోసం ఏఐ ఆధారిత అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నగరంలో జరిగింది. గ్లోబల్ హెల్త్‌కేర్ స్టెప్ నీట్-పీజీ అప్లికేషన్‌ను ప్రారంభించారు. దేశీయ వైద్యవిద్య భవిష్యత్తులో పరిశోధనాత్మక అంశాలలో రాణించి ప్రపంచానికి ఆదర్శం కావాలని అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. డాక్టర్ కేవీ లింగేగౌడ, మాజీ ఐఏఎస్ శ్రీనివాసమూర్తి, ఐబిఎస్‌సీ మెడికల్ కళాశాల ఈడీ ఉమానంబియార్, కిద్వాయ్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ తిమ్మయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం

బెంగళూరు, మే 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిత్రకళా పరిషత్‌లో జేడీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జేడీ స్కూల్ ఆఫ్ డిజైన్ నేతృత్వంలో రెండురోజుల విద్యార్థుల విన్యాస ప్రదర్శనతోపాటు ప్రతిభా పురస్కారాల ప్రదానం నిర్వహించారు. ఈ ఏడాది పాజ్ అనే థీమ్ తో వర్ధమాన ఇంటీరియర్ డిజైన్ విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనకు వేదికగా అవకాశం కల్పించారు. ఈసారి ఏఐ టెక్నాలజీతో రూపొందించిన డిజైన్లకు అవకాశం కల్పించడం విశేషం. ధ్రువి జైన్ ప్రదర్శించిన లివెంజా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వ్యవస్థాపక ట్రస్టీ నీలేశ్ దలాల్ మాట్లాడుతూ కేవలం వస్తు ప్రదర్శన, పురస్కారాల ప్రదానమే కాదని యువ డిజైనర్ల ఆధునిక భావాలకు, సమగ్రతకు, సహజ ప్రపంచ సవాళ్లు ఎదుర్కొనే అంశాలకు ఇందులో ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ప్రిన్సిపాల్ బీఆర్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిభతోపాటు వృత్తి జీవనానికి బాటలు వేసేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

ఖరీఫ్‌లో వర్షం.. రైతుల్లో హర్షం

పావగడ, మే 23(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభకాకుండానే వర్షాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 20 నుంచి మే 20వరకు కురిసిన వర్షాలకు రైతులు తమ పొలాలను చదును చేయడంలో నిమగ్నమయ్యారు. కసుబాలో 41మి.మీ, నాగలమడక 88.4, అర్సికెర 132.2, వైఎన్‌హొసకోట 144.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయాశాఖ అధికారులు తెలిపారు. రైతులకు అవసరమైన అన్నిరకాల విత్తనాలు సబ్సిడీ ధరలతో వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి పొందటానికి అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారి అజయ్‌కుమార్ తెలిపారు.

రోడ్డెక్కిన జొన్న రైతులు



రోడ్డుపై బైఠాయించిన రైతులు

కంప్లి, మే 23(ఆంధ్రజ్యోతి): రైతులు ఎండనక, వాననక కష్టపడి పండించిన జొన్నలు ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే నిరసన తప్పవని రైతు సంఘం హసురుసేన రాష్ట్ర రైతు సంఘం నాయకులు అమిన్ పాషా గిడికి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవాంర సింధనూరులో జొన్నల కొనుగోలు కేంద్రంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రధాన రోడ్లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను పాషా గిడిగి జిల్లా అధ్యక్షుడు బసవరాజు అంచినాళ్ మాట్లాడుతూ ఖరీఫ్ రబీ సీజన్లో రైతులు పండించిన జొన్నలను కొనుగోలు చేయడానికి పౌర ఆహారశాఖ ఆధ్వర్యంలో జొన్నలు ఖరీదు కేంద్రం ఏర్పాటు చేశారు. డిసెంబరు నెలలో జొన్నలు పండించే రైతులు 20 క్వింటాళ్ అమ్మకాలు చేసేందుకు రిజిస్ట్రేషన్ నమోదు చేశారు. కానీ ఒక నెల అనంతరం కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల నాలుగు నెలల అనంతరం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు కానీ అధికారులు జొన్నలు పుచ్చు పట్టాయి. 20 క్వింటాళ్లకు బదులుగా ఒక రైతుకు పది క్వింటాళ్ల మాత్రమే తీసుకుంటామని అధికారులు తెలిపారన్నారు. సుమారు అరగంట తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం పోలీసు శాఖ రెవెన్యూ శాఖ అధికారులతో చర్చించి తమకు అనుగుణంగా చేస్తామని అనడంతో నిరసనలు విరమించుకున్నారు. ఎన్నికల సమయంలో రైతులకు అండగా వుంటామని తెలిపి రైతులు తమకు న్యాయం కోసం రోడ్డెక్కినా యే నాయకుడు తమకు సహకరించడంలో విఫలమయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో చెనన్న గౌడ, బసవరాజు గూడేయాల్, నజీర్‌సాబ్, నాగన్న గౌడ, హులిహయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

సిరుగుప్ప : ప్రతి ఎకరాకు 20 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడవ రోజు జొన్నల విక్రయంలో నెలకొన్న సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగింది. ఇంతవరకు 20 క్వింటాళ్ల జొన్నలుకొనుగోలు చేసి ఇప్పుడు కేవలం ఎకరాకు పది క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని చెప్పడం హాస్యాస్పదంగా వుందని రైతులు విమర్శించారు. జొన్నలు కొనుగోలు చేయడంలో ఇంతటి అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పరిష్కారానికి అధికారులు ముందడుగు వేయాలని తహసీల్దార్ నరసప్పకు వినతిపత్రం అందజేశారు.



బస్సులు నిలిపివేసి ఆందోళన చేపట్టిన రైతులు



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1589.30	1,577.49
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	6,782	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,082	0
నీటి నిల్వ (టీఎంసీలు)	10.46	3.37

ఘనంగా ఊరమ్మదేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బళ్లారిరూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): కూడ్లిగి ఊరమ్మదేవి జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 15 సంవత్సరాలకోసారి జరిగే సంబరాలు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టి సాయంత్రం రథాన్ని లాగారు. మాజీ మంత్రి శ్రీరాములు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రథోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీరాములు

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం (హోస్పేట), ఏప్రిల్ 23 (ఆంధ్ర జ్యోతి): హువిన హడగలి తాలుకా ఉద్యానవన ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కృషి సించాయియోజన, యంత్రాల పథకాల కింద అర్హులైన లబ్దిదారుల ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జాతీయ ఉద్యానవన మిషన్ కింద బిందు సేద్యం పథకం కింద పండ్లు, కూరగాయల పంటలకు సబ్సిడీ సౌకర్యం వుంటుంది. పంటల కోసం హైబ్రిడ్ కూరగాయల, పూల విస్తీర్ణం విస్తరణ, వ్యక్తిగత సాగు గుంటలు మల్చింగ్ సీట్లు, యంత్రాల పథకం కింద సబ్సిడీ సౌకర్యం వుంటుంది. దరఖాస్తులను హడగలి, ఇటిగి, హిరేహడగలిలో అసిస్టెంట్ హార్టికల్చర్ ఆఫీసర్, రైతు సంప్రదింపు కేంద్రాలకు సమర్పించాలి. పూరించిన దరఖాస్తును సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ కార్యాలయానికి సమర్పించాలన్నారు.

5న చలో విజయవాడ

పుట్టపర్తి, మే 23(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జూన్ 5న నిర్వహిం చే రాష్ట్ర కౌన్సిల్ మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. శుక్రవారం ప్రశాంతి గ్రామం వద్ద రాష్ట్ర కౌన్సిల్‌కు సంబందించి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో పీఆర్‌సీ, డీఏ, సీపీఎస్, ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తామన్నారు. కావున ఉద్యోగులు భారీ ఎత్తు న తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, తాలూకా అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ, కోశాధికారి నిరంజనరెడ్డి పాల్గొన్నారు.

72 గంటల్లో పరిహారం అందించాలి

● వరద సహాయక చర్యల్లో అప్రమత్తంగా ఉండాలి ● ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షాలు: జడ్పీ అడ్మినిస్ట్రేటర్ త్రిలోక్‌చంద్ర



సమీక్షలో మాట్లాడుతున్న జడ్పీ అధికారి త్రిలోకచంద్ర

బళ్లారి సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో వర్షాలు జోరందుకున్నాయని, రుతుపవనాలు రాకముందే వానలు హోరెత్తుతున్నాయని, బాధితులకు 72 గంటల్లో పరిహారం అందించాలని జడ్పీ అడ్మినిస్ట్రేటర్ త్రిలోక్‌చంద్ర అన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా పంచాయతీ హాల్లో నిర్వహించిన నెలవారీ కేడీపీ పురోగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈసారి సాధారణం కంటే అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర ప్రకృతి విపత్తు నిర్వహణ కేంద్రం ప్రకటించిందన్నారు. ఇప్పటికే జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించబడిందని, సంబంధిత తాలూకా తహసీల్దార్, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా సాధారణ వార్షిక వర్షపాతం 599.5మి.మీ. ఈఏడాది 88.4మి.మీ. ఇది సాధారణ వర్షపాతం కంటే దాదాపు 64శాతం ఎక్కువన్నారు. జిల్లాలో విత్తనాలు, ఎరువుల నిల్వ తగినంతగా ఉందని దీనికి కొరత లేదని వ్యవసాయ సంయుక్త సంచాలకులు సోమసుందర్ తెలిపారు. జిల్లాలో ప్రజా పనులు, పంచాయితీ రాజ్ అభివృద్ధి శాఖలు నిర్వహిస్తున్న పనుల నాణ్యత క్షీణిస్తుందన్నారు. ఒక పాఠశాల మరమ్మతు పనులు మళ్ళీ ఆలస్యమయ్యాయని దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి వెంటనే చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈఓను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న షెడ్యూల్డ్ కులాల సమగ్ర సర్వేకు సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమావేశంలో తెలియజేశారు. అంతేకాకుండా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు సూచించారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహ్మద్ హారీస్, జిల్లాపంచాయితీ డిప్యూటీ సెక్రటరీ గిరిజా శంకర్, జిల్లాపంచాయితీ ప్లానింగ్ డైరెక్టర్ వాగీశ్ శివాచార్య, వివిధ జిల్లాస్థాయి శాఖల అధికారులు, టీపీఏ ఈఓలు పాల్గొన్నారు.

దివ్యాంగులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సంక్షేమ అధికారి గోవిందప్ప.. అవగాహన ర్యాలీ ప్రారంభం



ర్యాలీని ప్రారంభిస్తున్న సంక్షేమ అధికారి గోవిందప్ప

బళ్లారి సిటీ,మే 23(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ప్రభుత్వ సౌకర్యాలను పొంది సమృద్ధిగా జీవితాన్ని గడపాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి గోవిందప్ప అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో దివ్యాంగుల,సీనియర్ సిటీజన్ల సాధికారత శాఖ నిర్వహించిన 'భారత్ సుగమ్య యాత్ర' అవగాహన ర్యాలీలో పాల్గొని అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వారికి లభించే సౌకర్యాల గురించి దివ్యాంగులకు తెలియజేయాలన్నారు. వారు ఎటువంటి అడ్డంకులు లేకుండా తిరగడానికి సహాయక వాతావరణాన్ని అందించడం, వారు ప్రధాన స్రవంతిలోకి వచ్చేలా చూడటం అత్యంత ముఖ్యమైన విషయం అని ఆయన అన్నారు. భారత్ సుగమ్య యాత్ర అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ కార్యాలయ తహశిల్దార్ గౌసియా బేగం జెండా ఊపి ప్రారంభించారు.

కార్యాలయం ఏర్పాటుకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

కంప్లి, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాలుకా శిక్షణా అధికారి కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంగాధరయ్య తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ మంజునాథ కల్బుర్గి శిక్షణ విభాగం అధికారులకు, జిల్లా అధికారులకు రాసిన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గంగాధర మాట్లాడుతూ తాలుకాలో 119 స్కూళ్లకు పైగా వున్నాయి. అయినా తాలుకాలో శిక్షణ అధికారి కార్యాలయం లేకపోవడంతో పనుల నిమిత్తం కంప్లిలో వుండవలసిన కార్యాలయం కురుగోడులో వుండటంతో ఉపాధ్యాయులు విధులు వదిలి తమ పనుల కోసం 60 కిలోమీటర్లు వెళ్లి రావాల్సివస్తుంది. ఈ కార్యక్రమంలో గురుమూర్తి, శశిధర్, వీరేశప్ప, వీరన్న, శేఖరప్ప, పక్కీరప్ప, అమరేశ్వర, చంద్రప్ప, టీఎం బసవరాజు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాలల గదులు

● శంకరబండెలో పైకప్పు కూలి బాలిక మరణం బాధాకరం ● తక్షణమే మరమ్మతులు చేపట్టాలి: ఏఐడీఎస్ఓ



రైల్వేస్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న ఏఐడీఎస్ఓ సభ్యులు

బళ్లారి సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 21వేల ప్రభుత్వ పాఠశాలల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఏఐడీఎస్ఓ డిమాండ్ చేసింది. శుక్రవారం నగరంలోని రైల్వే స్టేషన్ ముందు ప్రభుత్వ పాఠశాలలను కాపాడటానికి , అభివృద్ధి చేయడానికి ప్రజల నుంచి సంతకాల సేకరణ ప్రచారాన్ని నిర్వహించింది. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ రాష్ట్రకోశాధికారి సుభాస్ బెట్టద కొప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 46,775 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వాటిలో 21,255 పాఠశాలలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదంలో ఉన్నాయని వీటిలో బళ్లారిలోని 171 పాఠశాలలు కూడా ఉన్నాయన్నారు. చాలా సంవత్సరాలుగా మరమ్మతులు చేయని పాఠశాలలు పైకప్పులు కూలిపోయినప్పుడు పిల్లలు గాయపడటం, చనిపోవడం దారుణమన్నారు. బళ్లారి తాలూకాలోని శంకరబండె గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని పాఠశాల పైకప్పు కూలిపోవడంతో మృత్యువాత పడడం బాధాకరమైన విషయమన్నారు. ఈ ఘటన రాష్ట్రంలోని పాఠశాలల దయనీయ పరిస్థితిని ప్రతిబింబిస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు 'పేదపిల్లల విద్యకు ఆశాకిరణం' కోట్లాది మంది విద్యార్థులు భవిష్యత్తుకు పునాదులన్నారు. పేదల బతుకులు ఇలా నిర్లక్ష్యానికి గురికావడం విచారకరమన్నారు. తక్కువ సంఖ్యలోవిద్యార్థులు ఉండటంతో 6వేల కుపైగా పాఠశాలలను మూసివేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాలను త్వరగా మరమ్మతులు చేసి,అవసరమైన ఉపాధ్యాయులను నియమించేందుకు ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాధ్యక్షుడు కే.ఈరన్న, ఉపాధ్యక్షురాలు ఎం.శాంతి, ఉమా, నిహారిక పాల్గొన్నారు.



టైలరింగ్ కార్డులు పంపిణీ చేస్తున్న రాజేశ్ హొసమనె

ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి

● బళ్లారి జీన్స్ కార్మికులు సంఘటితంగా ఉండాలి
● జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ,మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లాజీన్స్ గార్మెంట్ కార్మికులు సంఘటితంగా ఏర్పడి, ప్రభుత్వ ప్రయోజనాలను పొందాలని బళ్లారి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా సభ్య కార్యదర్శి రాజేశ్ హొసమనె పిలుపు నిచ్చారు. శుక్రవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, జీన్స్ గార్మెంట్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అసోసియేషన్, లా డిపార్ట్‌మెంట్, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్ డిపార్ట్‌మెంట్ , డిస్ట్రిక్ చైల్డ్ అండ్ ప్రొటెక్షన్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని డీడీఎస్ శిక్షణా కేంద్రంలో నిర్వహించిన కార్మిక దినోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 8గంటల పనికోసం కార్మికులు చేస్తున్న పోరాటంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా 194 దేశాల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. కార్మికులకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించడానికి, కార్మికుల సంక్షేమం కోసం అనేక హక్కులను అమలు చేశారన్నారు. దేశంలో రాజ్యాంగం ప్రకారం కార్మికులకు అనేక హక్కులు ఇవ్వబడ్డాయి. సమాన పనికి సమాన వేతనం,కనీస వేతన చట్టం, మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించబడ్డాయన్నారు. నేడు మహిళలు అన్నిరంగాల్లో సమానంగా పనిచేస్తున్నారన్నారు. మహిళలు తమ హక్కులను పొందేందుకు,ప్రభుత్వ ప్రయోజనాలను పొందేందుకు ముందుకు రావాలన్నారు. జిల్లాకార్మిక అధికారి సిద్దప్ప మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల కోసం కార్మికశాఖ కర్ణాటక రాష్ట్ర అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతా బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. ఈబోర్డులో నమోదు చేసుకున్న కార్మికులకు ఈ విభాగం అనేక సామాజిక భద్రతా ప్రయోజనాలను అందిస్తుందన్నారు. జి.ఎస్.రీచ్‌కు చెందిన సింహా, జీన్స్ గార్మెంట్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షురాలు సునీత, అసోసియేషన్ ఆఫీస్ బేరర్లు జాన్ సుధాకర్, రెహమాన్, సత్యనారాయణ,గౌష్, రీచ్ జిల్లా కోఆర్డినేటర్ హనుమంతప్ప, ఆఫీస్ బేరర్లు లక్ష్మీదేవి, బసమ్మ, ఎర్రిస్వామి,జీన్స్‌గార్మెంట్ యూనిట్లలో పనిచేస్తున్న వందలాది మంది మహిళా కార్మికులు పాల్గొన్నారు. నమోదు చేసుకున్న మహిళా వస్త్ర కార్మికులకు టైలరింగ్ కార్డులు అందజేశారు.

26న పౌర పోరాట కమిటీ నిరసన



మాట్లాడుతున్న బళ్లారి పోరాట కమిటీ నాయకులు సోమశేఖర్ గౌడ

బళ్లారి సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): నగరంలో అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం, కాల్వల దుస్థితిని నిరసిస్తూ ఈనెల 26న కార్పోరేషన్ ముందు నిరసన తెలియచేస్తున్నామని బళ్లారి పోరాట కమిటీ తెలిపింది. శుక్రవారం విలేకరుల సమావేశంలో కమిటీ నాయకులు సోమశేఖర్‌గౌడ మాట్లాడుతూ నగరంలో వర్షాలు కురిసినప్పుడల్లా డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటోందని, తాగునీటిలో అపరిశుభ్ర నీరు కలిసి కొళాయిలకు వదులుతున్నారన్నారు. రోడ్డుపై ఉన్న గుంతలు మూయడం లేదు. వీధి కుక్కలు, వీధి పశువుల సమస్యలపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పలు ససమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళనకు దిగుతామన్నారు. డాక్టర్ ప్రమోద్, ప్రొఫెసర్ నరసన్న, గురురాజ్, నాగరత్న, ఆర్.సోమశేఖర్‌గౌడ, శాంత, ఆంథోని, ఉమేశ్, విద్యా, సురేశ్ తదితరులున్నారు.

పాత్రికేయుడికి నివాళి



సంతోష్‌కు నివాళులర్పిస్తున్న కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్ సభ్యులు

బళ్లారి సిటీ/రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మరణించిన టీవీ9 కన్నడ చానల్ వీడియో జర్నలిస్ట్ సంతోష్ చినగుండి వర్ధంతి కార్యక్రమాన్ని కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. నగరంలోని ప్రతికాభవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సభ్యులు సంతోష్‌కు నివాళి అర్పించారు. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వీరభద్రగౌడ మాట్లాడుతూ సంతోష్ స్నేహపూర్వక స్వభావానికి చిరునామా అని, చిన్న వయస్సులోనే ఆయన అకాల మరణం అందరిని దుఃఖసాగరంలో ముంచెత్తిందన్నారు. పాత్రికేయులు పని ఒత్తిడిలో ఉన్నా ఆరోగ్యంపై శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా సభ్యులు వెంకోబి, నరసిహ మూర్తి, హంద్యాల పురుషోత్తం, మహేంద్రకుమార్, కిన్నూరేశ్వర్, హరికృష్ణ, సమాచార శాఖ గురురాజ్, సభ్యులు హరిశంకర్, మారుతీ సునగార,గురశాంత్,రేనేఖాచార్య ,వెంకటేశ్‌కులకర్ణి, అంబరీష్, శివానంద్,సిద్దు, శ్రీనివాస్‌శెట్టి, మురళీకాంతరావు, భరత్, నందీష్, హనుమేశ్‌రావు, సిద్దికీ, గోవర్ధనరెడ్డి, విజయ కుమార్, రాధాకృష్ణ, పీరాసాబ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కనగోలు తిమ్మప్పకు..



తిమ్మప్పకు నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు, రాఘవ మెమోరియల్ సభ్యులు

బళ్లారి సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): బళ్లారి రాఘవ కళామందిరంలో రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకర్లతోట కనగోలు తిమ్మప్ప 25వ వర్ధంతి కార్యక్రమాన్ని సంస్థ ఆఫీస్ బేరర్లు,కనగోలు తిమ్మప్ప కుటుంబ సభ్యులు ప్రారంభించారు. ఈసందర్భంలో రిటైర్డ్ లెక్చరర్, సంస్థ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బసవరాజు మాట్లాడుతూ తిమ్మప్ప మే5న 1903లో బళ్లారిలోని కాకర్లతోట గ్రామంలో దొడ్డవీరప్ప కుమారుడిగా జన్మించారన్నారు. అతను పెరిగి పెద్దవాడై వ్యాపారం ప్రారంభించి మంచి వ్యాపారవేత్త అయ్యారు. 1965లో ఆయన బళ్లారి మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలిచి నగరానికి కౌన్సిలర్‌గా సేవలందించారు, 1962/69 మధ్య అతను కంప్లి చక్కెర కర్మాగారం, బళ్లారి జనతా బజార్ అధ్యక్షుడిగా పనిచేశాడు. 1971నుండి 2000వరకు అతను బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలికి అధ్యక్షుడిగా, కన్నడ తెలుగు నాటకాలను తన సొంత కళాకారులుగా ప్రోత్సహించి అత్యుత్తమ కళాకారులను సత్కరించి గౌరవించారు. ఆయన 22-05- 2000 న మరణించారు.బళ్లారిలోని రెండు సంస్థలకు ఆయన అందించిన సహకారం అపారమైనది, సంస్థ జాయింట్ సెక్రటరీ రామాంజనేయులు కనగోలు తిమ్మప్ప సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. సంస్థ అధక్షులు కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు చన్నప్ప, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమేశ్‌గౌడపాటిల్, సుంయుక్త కార్యదర్శి రామంజనేయులు, అమరేంద్రనాథ్, విఠల్, రమణప్ప, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శించిన 'సంపద' అనే తెలుగు సాంఘిక నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. లాల్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్ రవీంద్ర నాథ్, జిఆర్ వెంకటేశులు, హసీనా తిరుపతి, రంగన్న, లత వంటి కళాకారులు తమ అద్భుతమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

హోసూరు జోన్

గుట్కా స్వాధీనం.. దుకాణాలకు నోటీసులు



యజమానులకు నోటీసులు అందజేస్తున్న అధికారులు

హోసూరు, మే 23(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలో నిషేధిత గుట్కాను విక్రయిస్తున్న దుకాణాలకు జరిమానా విధించి, నోటీసులు జారీ చేశారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాలతో అధికారులు కార్యాచరణలో పాల్గొన్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి ముత్తుమారియప్పన్, శానిటేషన్ ఆఫీసర్‌లు ప్రభాకరన్, అన్బళగన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గిరి నేతృత్వంలో దాడులు నిర్వహించారు. నగరంలోని బాగలూరు, శ్రీనగర్, ఆనంద్‌నగర్, పెరియార్ నగర్ తదితర ప్రాంతాలలో దాడులు కొనసాగాయి. 26 దుకాణాలను తనిఖీ చేయగా 3 దుకాణాలలో నిషేధిత పొగాకు ఉత్పత్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో దుకాణానికి రూ.25వేల జరిమానా విధించి, హెచ్చరిక నోటీసు జారీచేశారు. అమ్మరాదని హెచ్చరించారు.

కావేరి అమ్మన్ ఆలయంలో విశేష పూజలు



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

హోసూరు, మే 23(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని అవలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వందల సంవత్సరాల పురాతనమైన అరుళ్మిగు కావేరి అమ్మన్ ఆలయ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. రెండురోజుల జాతరలో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పురవీధులలో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.




జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ర్యాలీ

హోసూరు, మే23(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం జాతీయజెండాతో ఊరేగించారు. ఉత్తంగిరై పంచాయతీ యూనియన్ కార్యాలయం నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు ర్యాలీ సాగింది. విష్ణు యోగా నందస్వామిజీ అధ్యక్షత వహించారు. ఆర్‌పీఎస్ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రిన్సిపాల్ పొన్నుస్వామి ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. మాజీ సైనికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సముదాయ భవనానికి నిధుల కేటాయింపు హర్షణీయం

కాంగ్రెస్ నాయకుడు రవి భోసరాజు



రాయచూరు, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సముదాయ భవనం నిర్మించాలని రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రవి భోసరాజు స్వాగతించారు. ఇందుకు జిల్లా ప్రజల తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. శుక్రవారం నగరంలో విలేకరులతో మాట్లాడిన రవి భోసరాజు, గురువారం జరిగిన రాష్ట్ర మంత్రి మండలిలో రాయచూరు జిల్లా కేంద్రంలో సముదాయ భవన నిర్మాణం కోసం రూ.40 కోట్లు కేటాయించేందుకు తీర్మానించడం హర్షదాయకమన్నారు. పలు సమాజపరమైన కార్యక్రమాల నిర్వహణ కోసం అనువైన వేదిక లేకపోవడం నిర్వాహకులకు ఇబ్బందిగా ఉండేదన్నారు. అనివార్యంగా అధిక వెయ్యన్ని వనకూర్చి పలు కార్యక్రమాలు నిర్వహించుకునే వారని ప్రభుత్వ నిర్ణయం వల్ల సామాజిక కార్యాక్రమాల నిర్వహణకు వివిధ సాంస్కృతిక, కళ కార్యక్రమాలకు వేదిక లభించనుండడం సంతోషకరమన్నారు.

మద్యం అమ్మకాలపై నిషేధం

విజయనగరం (హోస్పేట), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని హగరిబొమ్మనహళ్లి తాలుకాలోని మాలావి గ్రామంలో, కూడ్లిగి తాలుకాలోని గుండుమణుగు గ్రామంలో ఖాళీగా ఉన్న స్థానాలకు ఆదివారం ఎన్నికలు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న గ్రామ పంచాయతీ ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు జిల్లాకలెక్టర్ ఎంఎస్ దివాకర్ మద్యం అమ్మకాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కర్ణాటక గ్రామ స్వరాజ్, పంచాయతీ రాజ్ చట్టం 1993లోని సెక్షన్ 308ఏసీ ప్రకారం మే 23 సాయంత్రం 5 గంటల నుంచి మే 25 సాయంత్రం 5 గంటల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న ప్రాంతాల్లో అన్ని రకాల మద్యం అమ్మకాలు, రవాణాను నిషేధిస్తూ మద్యం తయారీ యూనిట్లు, దుకాణాలను మూసివేయనున్నారు.